క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబాదేవికి ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



లక్ష్మీసహస్ర

నంద్యాల(న్యూటౌన్): తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నంద్యాలకు చెందిన విద్యార్థిని లక్ష్మీసహస్ర సత్తాచాటారు. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో ఈ విద్యార్థిని ఇంటర్ ఎంపీసీ చదువుతుంది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 1000/993 మార్కులు సాధించింది.

డీఎస్సీ పరీక్షలకు గడువు పెంచాలి



మాట్లాడుతున్న నాగరాముడు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పరీక్షల నిర్వహణకు 90 రోజుల గడువు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నోటిఫికేషన్‌కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో 27 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు నిరాశకు గురిచేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ ఊసే ఎత్తకపోవడం విచారకరమన్నారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అభ్యర్థుల వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, విష్ణు, పాములేటి తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేకు సహకరించండి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: భూ రీసర్వేకు ప్రతి రైతు సహకరించాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో భూ రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వే రైతుల సమక్షంలోనే జరుగుతుందన్నారు. పొలం విస్తీర్ణంలో ఏమైనా వ్యత్యాసాలు ఉంటే తగిన పత్రాలు చూపించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. దీనివల్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ, మండల సర్వేయర్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభసాటి



పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేక అధికారి

రుద్రవరం: పండ్ల తోటల సాగు రైతుకు ఎంతో లాభసాటి అని మండల ప్రత్యేక అధికారి నాగరాజు అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా పండ్ల తోటలు సాగు చేసే రైతులను గుర్తించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులకు పండ్ల తోటల సాగు, దాని వల్ల కలిగే మేలును వివరించాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్, ఏపీఓ పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

బండి ఆత్మకూరు: కడమల కాలువ గ్రామానికి చెందిన కలసపాటి పెద్ద వెంకట స్వామి (42) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. మంగళవారం అడవికి వంట చెరుకు తెచ్చుకునేందుకు ఆటోలో వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జమాలయ్య దర్గా వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఆటో కేబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య జయమ్మ ఉంది. సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు!

వారు రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు. ఏరోజు వేతనం ఆరోజు వస్తేనే వారికి పూట గడవడం కష్టం. అలాంటిది 100రోజులు దాటినా చేసిన పనికి డబ్బు అందకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. తమకు వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని కనిపించిన అధికారులందరినీ వేడుకుంటున్నారు. ఇది జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీల దుస్థితి.

- చేసిన పనికి వేతనం అందక కూలీల అవస్థలు
- జిల్లాలో ఉపాధి బకాయిలు ... రూ 54.60 కోట్లు
- మెటీరియల్ కాంపోనెంట్ బకాయిలు రూ. 50 కోట్లు
- జనవరి 15 నుంచి ఆగిన చెల్లింపులు
- ఇతర పనులు వెతుక్కుంటున్న శ్రామికులు



ఆళ్లగడ్డ శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



పనులకు వస్తున్న మహిళా కూలీలు

ఆళ్లగడ్డ: జిల్లాలో 28 మండలాల పరిధిలో 2,62,870 కుటుంబాల్లోని 4,91,255 మంది ఉపాధి హామీ పనుల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. రోజు పనిదినాల లక్ష్యం 1,35,700 గా నిర్దేశించగా ప్రతి రోజు 67,363 మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలు పనిచేసిన వారం నుంచి రెండు వారాల్లోపు వేతనాలు ఖచ్చితంగా అందించాలి. అయితే, ప్రస్తుతం సుమారు 14 వారాలు అవుతున్నా చేసిన పనులకు సంబంధించి వేతనాలు అందడంలేదు. జిల్లాలో ఇప్పటి వరకు (ఏప్రిల్ 22 దాక) రూ 54.60 కోట్లు కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. చేసిన పనులకు డబ్బులు ఎప్పుడు ఇస్తారా అని కూలీలు ఎదురు చూస్తున్నారు.

పనులు మానిన దైన్యం

ఈ – మస్టర్ ప్రకారం పరిశీలిస్తే జనవరి 1వ తేదీ వరకు జిల్లాలోని 489 గ్రామ పంచాయతీల పరిధిలో రోజుకు సుమారు 1.30 లక్షల మంది కూలీలు పనిచేశారు. ఇప్పుడు 165 పంచాయతీల్లో రోజుకు సుమారు 15 వేలు లోపు కూలీలే పనులకు వెళ్తున్నారు. 100 రోజుల వ్యవధిలో కూలీల సంఖ్య రమారమి 1.35 లక్షలు తగ్గినట్లే. ఇందుకు పూర్తిగా వేతన బకాయిలే కారణంగా స్పష్టమౌతోంది.

ముఖం చాటేస్తున్న ఉద్యోగులు

జిల్లాలో అత్యధికంగా కూలీలు హాజరయ్యే మండలాలైన డోన్, ప్యాపిలి, బనగానపల్లె, బేతంచర్ల, ఆత్మకూరు, పాణ్యం, గోస్పాడు, రుద్రవరం, చాగలమర్రి తదితర మండలాల్లోనే అధికంగా కూలీలకు బకాయిలు ఏర్పడ్డట్లు తెలుస్తోంది. ఈ మండలాల్లో ఒక్కో మండలంలో రూ 4 కోట్లకు పైగానే బకాయిలు ఉన్నాయి. దీంతో క్షేత్రస్థాయి ఉపాధి సిబ్బంది కూలీలను పనులకు పిలువాలంటే జంకుతున్నారు. పిలిచేందుకు వెళ్లగానే నేరుగా కూలీలు బకాయి వేతనాలను అడుగుతున్నారు. ఏం సమాధానం చెప్పాలో దిక్కుతోచక మండల, డివిజన్ స్థాయి అధికారులు పల్లెలకు వెళ్లడమే మానేశారు.

వ్యవసాయ పనులే దిక్కు

ఉపాధి పనులకు వెళ్లి చేతులకు బొబ్బలు వచ్చేలా పనిచేసినా సకాలంలో డబ్బులు అందక పోవడంతో కూలీలు ఆ పనులకు ఆసక్తి చూపడం లేదు. దీంతో జిల్లాలో ఎక్కువ శాతం ఉపాధి కూలీలు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ పనుల మీద ఆధారపడుతున్నారు. గ్రామాల్లో చేతినిండా పనులు లేక పోవడంతో సుదూర ప్రాంతాలకు ఆటోల్లో వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు. ఏపని దొరకని కూలీలు మాత్రం ఉపాధి పనికే వెళ్తున్నారు.

మెటీరియల్ కాంపోనెంట్‌పై ప్రభావం

ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గితే దాని ప్రభావం మెటీరియల్ కాంపోనెంట్ నిధులపై పడుతుంది. వేతనాల చెల్లింపులో 60:40 కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వస్తాయి. ఆ నిధుల లభ్యతను బట్టి రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని అనుసంధానం చేసి గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాలు, మినీ గోకులాలతో పాటు హౌసింగ్ పథకాలను చేపడుతుంది. మరోవైపు వర్షాకాలం కావడంతో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యాలను పూర్తిచేయాలని నిర్ణయించింది. కూలీలకు వేతనాల చెల్లింపులు నిలిచిన కారణంగా మిగతా అభివృద్ధి పనులకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు కింద రావల్సిన సుమారు రూ. 57 కోట్లు సకాలంలో వస్తాయా లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఉపాధి పనులు జరుగుతున్న గ్రామ పంచాయతీలు	: 489
జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారు	: 4,33,177
మంజూరు అయింది	: 2,62,870
పనులకొచ్చే కూలీల సంఖ్య	: 67,363
పనిదినాల లక్ష్యం	: 88 లక్షలు
పూర్తయిన పనిదినాలు (ఏప్రిల్ 22కు)	: 13,53,764
వేతన బకాయిలు	: 54.60 కోట్లు
మెటీరియల్ కాంపోనెంట్ బకాయిలు	: సుమారు రూ 50 కోట్లు

ప్రధాన పండుగలపూట పస్తులే..

వారం రోజుల పాటు ఉపాధి పనులకు వెళ్లిన కూలీల వివరాలతో వారు చేసిన పనిని బట్టి తర్వాత వారంలో సోమవారం నుంచి బుధవారం లోపు మండల కార్యాలయాల్లో ఉన్న ఆపరేటర్లు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తారు. శనివారం లోగా కూలీల బ్యాంకు ఖతాకు డబ్బులు జమయ్యేవి. జనవరి 15వ తేదీ వరకు కొంతమేర కూలీలకు డబ్బులు అందినా.. తర్వాతి నుంచి పెండిగ్ పడుతూ వస్తున్నాయి. మహాశివరాత్రి, రంజాన్, ఉగాది, శ్రీరామనవమి, గుడ్ ఫ్రైడే, ఈస్టర్ లాంటి పండుగలతో పాటు జాతర్లు, తిరునాళ్లు, పెళ్లిళ్లు, శుభకార్యాలు జరుగుతున్నప్పటికీ పస్తులు తప్పడటం లేదు.

అధికారులు స్పందించాలి



నేను, నా భర్త ఇద్దరం రోజు కరువు (ఉపాధి) పనికి వస్తున్నాం. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా వేతనం పడలేదు. వారంవారం వస్తుందని చెప్పారు. ఎందుకు రావడంలేదో అర్థం కావడం లేదు. కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలో అధికారులు గుర్తించాలి. ఇప్పటికైనా స్పందించి కూలీ డబ్బులు వారంవారం అందించేలా ఏర్పాట్లు చేయాలి. – రంగమ్మ, ఉపాధి కూలీ

కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది



మా ఇంట్లో ఉండే ముగ్గురం రోజు ఈ పనికే వస్తునాం. మాకు ఉపాధి కూలీ తప్ప వేరే ఆధారం లేదు. పనికి వచ్చినప్పటినుంచి ఇంత వరకు ఒక్కరూపాయి కూడా మాకు పడలేదు. కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది. వేరే పనులకు పోదామంటే వ్యవసాయ పనులు లేవు. త్వరగా డబ్బులు వచ్చేలా చూడాలి

– వెంకటమ్మ, ఉపాధి కూలీ

త్వరలోనే చెల్లింపులు



ఉపాధి పనులు చేసిన కూలీలకు చెల్లింపులు నిలిచిన మాట వాస్తవమే. రెండు, మూడు రోజుల్లో నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. నిధులు రాగానే జిల్లాలోని కూలీలకు పెండింగ్ వేతనాలను వారి ఖాతాల్లో జమ చేస్తాం.

– వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులు పడుతున్న శ్రమను చూశానని, వారి కష్టాల్లో భాగం పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. నంద్యాలలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు తగిన స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జర్నలిస్టులు పేదవారని, వారికి ఇంటి స్థలాలతో పాటు అర్హులకు అక్రిడియేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్‌లాల్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలంబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు బాలమద్దిలేటి, సీనియర్ పాత్రికేయులు జనార్ధన్‌రెడ్డి, భాస్కరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేత



విజేతలతో జేవీవీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జనవిజ్ఞాన వేదిక జిల్లాలో నిర్వహించిన యూరేకా సైన్స్ ఎక్స్‌పో -2025 కార్యక్రమ విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు ప్రదానం చేసినట్లు ఆ వేదిక కన్వీనర్ రామరాజు తెలిపారు. పర్యావరణం, స్వావలంబన అభివృద్ధిపై ఎక్స్‌పరిమెంట్ వీడియో పోటీల్లో శ్రీలక్ష్మీ ఇంగ్లిష్ మీడియం, గుడ్‌షెపర్డ్ పాఠశాలలకు చెందిన ముజ్‌ఫర్‌తోఫిక్, సమీర్, సూర్యప్రకాష్, ఆనంద్‌సింగ్, జశ్వంత్ అనే విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచినట్లు వెల్లడించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 30 సంవత్సరాలుగా సైన్స్ ప్రచారం చేస్తున్నది జనవిజ్ఞాన వేదిక అన్నారు. అనంతరం న్యూక్లియస్ కళాశాల డైరెక్టర్ వాసుదేవరెడ్డి సౌజన్యంతో మెమెంటోలు అందజేశారు. మూఢనమ్మకాలపై జేవీవీ నిరంతరం సమరం సాగిస్తుందని ఎస్‌వీ రమణ అన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు చిన్నయ్య, ఖాజా, పునీత్, జమీల్ అహమ్మద్, సంజీవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు పోరాడుదాం



సీపీఎం కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విప్లవాన్ని విజయవంతంగా నడిపిన యోధుడు లెనిన్ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ అన్నారు. మంగళవారం లెనిన్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ లెనిన్ విప్లవ సూత్రాలు, సిద్ధాంతాలు నేటికి ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, పీడీఎస్‌యూ నాయకులు రాంబాబు, లక్ష్మణ్, రాజు, మనోజ్, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో లెనిన్ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు తోటమద్దులు మాట్లాడుతూ లెనిన్ ఆశయాలు సాధించేందుకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామచంద్రుడు, నాగరాజు, లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, వీరేసేన, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

కనిపించని కాడెద్దులు..!

- వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం
- భారంగా మారుతున్న పెట్టుబడులు



ఎద్దులతో పొలం దున్నుతున్న రైతన్న

ప్యాపిలి: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతన్న కూడా మారక తప్పడం లేదు. వ్యవసాయంలో యంత్ర పరికరాల వినియోగం పెరుగుతుండడంతో క్రమంగా కాడెద్దులు కనిపించకుండా పోతున్నాయి. యంత్ర పరికాల వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ పని జరుగుతుంది. అదే కాడెద్దులతో పని చేస్తుంటే ఎక్కువ సమయం అయినప్పటికీ అందులో ఉన్న సంతృప్తి యంత్ర పరికారల్లో రాదని రైతులు అంటున్నారు. గతంలో పొలం దుక్కి దున్నాలన్నా, పంట సాగు చేయాలన్నా కాడెద్దులతోనే చేసేవారు. ప్రస్తుతం గ్రామీణులు అన్ని పనులకూ ట్రాక్టర్లు, ఇతర యంత్రాలనే వాడుతున్నారు. కౌలు రైతులు సైతం యంత్ర పరికరాలతోనే వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కాడెద్దులు ఉంటే గతంలో చేతి నిండా పని, చేతిలో డబ్బులు ఉండేవి. ఇప్పుడు పనిలేక, ఎద్దులను పోషించలేక పలువురు రైతులు వాటిని విక్రయిస్తున్నారు.

అన్ని పనులకు ఆధునిక పరికాలే..

పల్లె సీమల్లో గతంలో తెల్లవారగానే రైతులు కాడెద్దులతో పొలాలకు చేరుకునేవారు. ప్రతి రోజూ నాగలిపట్టి కాడెద్దులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాన్ని దున్నుకునేవారు. అయినా రైతులకు ఏమాత్రం కష్టం అనిపించేది కాదు. ప్రస్తుతం ట్రాక్టర్లతో కొద్ది గంటల్లోనే పొలాలను దున్నేస్తున్నారు. అలాగే గతంలో రైతులు పండించిన పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చాలంటే ఎంతో వ్యయప్రయాసలు పడేవారు. రోజుల తరబడి ఇదే పనిలో రైతులు నిమగ్నమయ్యేవారు. ప్రస్తుతం ట్రాక్టర్ల ద్వారా గంటల వ్యవధిలోనే అని పనులు చేసుకుంటున్నారు.

అదనపు నిధులు వ్యక్తిగత ఖాతాల్లో జమ

ఉయ్యాలవాడ : గృహ నిర్మాణం పథకం కింద నిర్మాణాలు కొనసాగిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు నిధులు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసినట్లు హౌసింగ్ డీఈ విజయబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 23 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున మొత్తం రూ. 3.45 లక్షలు జమ అయినట్లు తెలిపారు. ప్రభుత్వ గృహాలు మంజూరయిన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): విద్యుత్ సంస్థలో ఆపరేటర్, క్లర్క్ పోస్టులు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.5 నుంచి రూ.10లక్షలు వసూలు చేస్తున్న ఎన్‌జీఓ కాలనీకి చెందిన దుర్గాప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. లోకేశ్వర్ కన్‌స్ట్రక్షన్ పేరు పెట్టుకొని విద్యుత్ సంస్థలో ఉద్యోగాలు అంటూ మోసాలకు పాల్పడుతూ బెదిరింపులకు దిగుతున్న దుర్గాప్రసాద్‌ను విచారించాలని కోరారు. ఈ అంశంపై ఎంపీఆర్‌పీఎస్ నాయకులు మంగళవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులికొండన్న మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుతోనైనా పోలీసులు దుర్గాప్రసాద్‌ను విచారించాలని, లేని పక్షంలో విద్యుత్‌శాఖ, కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జయరాం, కాశన్న, స్వామినాయుడు, గౌరి, శంకర్, పరమేష్, బైరేష్, పెద్దక్క, నాగమణి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరానికి చెందిన వెంకటేశ్వర్లు (38)అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు.. మృతుడు ఇంటి వద్ద చిల్లర దుకాణం నిర్వహించేవాడు. వ్యాపారం అంతం మాత్రంగా ఉండటంతో జీవనం దుర్భరమై ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. దీంతో రసాయన పౌడర్ నీటిలో కలుపుకొని ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలా ఉంటే అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త దుకాణంలో ఈనోపౌడర్‌కు బదులు ఇంటి అలంకరణకు ఉపయోగించే రసాయన పౌడర్‌ను నీటిలో కలుపుకొని తాగడంతో చికిత్స నిమిత్త నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందినట్లు భార్య ఆదెమ్మ తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



చాగలమర్రిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓలు అనురాధ, సయ్యద్ న్యామతుల్లా విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం చాగలమర్రిలో ఎన్‌రోల్‌మేంట్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వలన క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం తదితరవి ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు శేషాద్రి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

భావితరాల కోసం భూమిని కాపాడుకుందాం



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో క్యూ ఆర్ కోడ్‌ను చూపుతున్న దృశ్యం



ఆళ్లగడ్డలో ధరిత్రీ దినోత్సవంలో భాగంగా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: భావితరాల మనుగడ కోసం భూమిని కాలుష్య కోరల నుంచి కాపాడుకుందామని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు.తువ్వపల్లె తిప్పమీదున్న మోడల్ పాఠశాలలో మంగళవారం ఆయన సైన్స్ ఉపాధ్యాయులు చవాన్, నారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో వృక్ష సమాచారాన్ని సేకరించి, ఆ వివరాలతో చెట్ల వద్ద క్యూర్ కోడ్‌ను ప్రదర్శించారు.అలాగే విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. భూమికి నష్టం కలగజేస్తున్న కాలుష్యం, భూతాపం వంటి సమస్యలకు సుస్థిర పరిష్కారం కనుగొని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అలాగే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు.

నంద్యాల(న్యూటౌన్): నేల, నీరు, గాలి వీటిలో ఏ ఒక్కటి స్వచ్ఛతను కోల్పోయినా మానవ జీవితం ప్రశ్నార్థకంగా మారుతుందని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం చలపతి అన్నారు. సమస్త జీవరాశులకు భూమి మీద నివసించే హక్కు ఉందని, భూమి కాలుష్యం కాకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణంలో ఏపీ ఎన్‌జీసీ ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్‌జీసీ సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం చలపతి, జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భూమిపై చెట్లను నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సుందర్‌రావు, జగన్‌మోహన్‌రెడ్డి, పద్మావతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పుడమితల్లిని రక్షించుకుందాం

ఆళ్లగడ్డ: పుడమితల్లిని రక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక ప్రజ్ఞా హైస్కూల్‌లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ద్వార నేలతల్లిలని కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

వైభవంగా శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం



పల్లకీలో శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని ముదురాళ్లపల్లె గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు డి.వనిపెంట గ్రామ సర్పంచ్ రేనాటి బాలీశ్వరరెడ్డి, ప్రభావతి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతినెల శ్రీవెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రం రోజున స్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ప్రముఖ అర్చకులు సంపత్ కుమార్ శర్మ వేద మంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, పులి చిన్న ఓబుల్‌రెడ్డి, పులి ఓబుల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



మృతుడు నరసింహుడు (ఫైల్)



అంత్యక్రియలకు ముందు గాలిలోకి కాల్పులు జరుపుతున్న జవాన్లు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన రిటైర్డ్ బీఎస్‌ఎఫ్ జవాన్ నరసింహులు అంత్యక్రియలను మంగళవారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. బీఎస్‌ఎఫ్‌లో జవానుగా విధులు నిర్వహిస్తూ 4 సంవత్సరాల క్రితం రిటైర్ అయిన నరసింహులు కడప పట్టణంలోని బ్యాంకులో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లున్నారు. అయితే, కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మంగళవారం స్వగ్రామమైన చింతలచెరువులో బీఎస్‌ఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ రవిరంజన్ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి, ఎక్స్ సర్వీస్‌మెన్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరంగయ్య, సభ్యులు చాంద్‌బాషా, నాగరాజు, బీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శనగల బసవన్నకు పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో నగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభపూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.